# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 11 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## తెలంగాణలో రాష్ట్రపతి ఐదురోజుల పర్యటన

- ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల పాటు తెలంగాణలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్ర రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ఇవాళ సచివాలయంలో సమీక్షించారు. పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ముర్ము ఈ నెల 17 నుంచి (21 వరకు) ఐదు రోజుల పాటు తెలంగాణలో పర్యటించనున్నారని ఈ మేరకు హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ఆయన చేస్తారని సిఎస్ తెలిపారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, తగురీతిలో విస్తృత ఏర్పాట్లు చేయాలని సిఎస్ ఆదేశించారు. పోలీసు శాఖ తగిన భద్రతా ఏర్పాట్లు, సరైన ట్రాఫిక్, బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని, అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు తగిన అగ్నిమాపక ఏర్పాట్లు, ఫైర్ టెండర్లను ఏర్పాటు చేయాలని సిఎస్ సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ సహాయక సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

# డిజిటల్ యుగంలో సవాళ్లు

- న్యూఢిల్లీలో జాతీయ మానవ హక్కుల సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రస్తుత డిజిటల్ యుగంలో సవాళ్లు పొంచిఉన్నాయని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం విస్తృతంగా వ్యాప్తి చెందుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. సైబర్ నేరాలు, డీప్ ఫేక్, ప్రజల గోప్యతకు భంగం వంటి విషయాలు మానవులకు కొత్త ముప్పుగా పరిణమిస్తున్నాయన్నారు. వీటిని నివారించాలంటే ప్రజల హక్కులను, గౌరవాన్ని కాపాడే డిజిటల్ వాతావరణాన్ని కల్పించడం చాలా ముఖ్యమని 'మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి పేర్కొన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిచేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాలతో పాటు వాతావరణంలో వచ్చే వివిధ రకాల మార్పులను ఎదుర్కొంటోందని ముర్ము అన్నారు. ప్రస్తుత ప్రజల జీవితాల్లో ఏఐ ప్రభావం గురించి ఆమె మాట్లాడుతూ "కృత్రిమ మేధ ఇప్పుడు మన రోజూవారీ జీవితంలోకి ప్రవేశించింది. మన సమస్యలను పరిష్కరిస్తోంది. కానీ మనకు తెలియకుండానే పలు కొత్త సమస్యలను సృష్టిస్తోంది. దీనికి ప్రాణం లేకపోయినా సృష్టించింది మానవులే కాబట్టి.. ఈ సవాళ్లకు మనమే తగిన పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉంది" అని తెలిపారు.

సార్వత్రిక మానవ హక్కుల పరిరక్షణ ప్రకటనను ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1948లో ఆమోదించింది. ఆ తీర్మానంలో రూపొందించిన హక్కులు, స్వేచ్ఛపై అందరిలోను అవగాహన పెంచి, వాటి అమలుకు రాజకీయ దృఢ సంకల్పాన్ని పెంపొందించడానికి ఏటా డిసెంబరు 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం జరుపుకొంటున్నాం. ప్రజల్లో మానవ హక్కులపై అవగాహన పెంచడానికి, ప్రభుత్వాలు మరింత బలంగా వాటి పరిరక్షణకు పూనుకోవడానికి ఈ కార్యక్రమాలు ప్రేరణగా నిలిచే అవకాశం ఉందని ఐరాస పేర్కొంది. ఇందులోభాగంగా రూపొందించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030 నాటికి సాకారం చేయాలని పిలుపునిచ్చింది.

## తెలంగాణ తల్లి అవతరణం.. ఓ భావోద్వేగ క్షణం

- సీఎం రేవంత్ రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర సచివాలయంలో సోమవారం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా మంగళవారం ఎమోషనల్ ట్వీట్ చేశారు. " అది భావోద్వేగ క్షణం మన తల్లి అవతరణం" అంటూ సీఎం ట్వీట్ చేశారు. "భావోద్వేగ క్షణం.. మన తల్లి అవతరణం.. నాలుగు కోట్ల బిడ్డలం.. తీర్చుకున్న రుణం.. తల్లీ తెలంగాణమా.. నిలువెత్తు నీ రూపం.. సదా మాకు స్ఫూర్తిదాయకం".. అని సీఎం రేవంత్ టీ–్వట్ చేశారు. దీనికి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సమయంలో తీసిన వీడియోను ఆయన జోడించారు.

## హైడ్రా కమిషనర్‌ను కలిసిన బీజేపీ ఎమ్మెల్యే..

- పలు కంపెనీలపై ఫిర్యాదు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లో హైడ్రామా కమిషనర్ రంగనాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్న పలు కంపెనీలపై ఆయన ఫిర్యాదు చేశారు. ఆయా కంపెనీల పేర్లు ఏమిటో కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువులను కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తాను ఫిర్యాదు చేసిన ఐదు కంపెనీలకు అనుమతులు ఇచ్చిన వారిపెఅండగా ఉన్న ప్రభుత్వ పెద్దలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూ ఆక్రమణలను అరికట్టేందుకు ప్రభుత్వం నూతనంగా చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

## కేసీఆర్ లాగే రేవంత్‌రెడ్డి : ఎంపీ ధర్మపురి అరవింద్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ కూడా కేసీఆర్ బాటలోనే సాగుతోంది: ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. "పసుపు బోర్డును మహారాష్ట్రకు తరలించేందుకు కొందరు సీనియర్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందూరుకే ఆ బోర్డు వస్తుంది" అని చెప్పారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లిలో విమానాశ్రయ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఓకే చెప్పిందని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఇయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ కూడా కేసీఆర్ బాటలోనే సాగుతోందని, ఓఎల్ఎస్ సర్వే చేసి మ్యాండేట్ ఇస్తే సరిపోతుందని తెలిపారు. స్థానికంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు పట్టించుకుని సర్వే పూర్తి చేయాలని అన్నారు. ఆర్వోబీ, అర్‌యూబీకి సంబంధించిన బిల్లులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించకుండా కాంట్రాక్టర్లకు చెల్లించాలని చెప్పారు. కాంగ్రెస్ ఏడాదిగా ఎన్నో అబద్ధాలు ఆడుతోందని అన్నారు. ఇచ్చిన హామీలు ఏమైపోయాయని నిలదీశారు. 75 శాతం తన నియోజకవర్గం రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు.

"పసుపు బోర్డును మహారాష్ట్రకు తరలించేందుకు కొందరు సీనియర్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందూరుకే ఆ బోర్డు వస్తుంది. తెలంగాణను దోచుకున్న వ్యక్తి కేసీఆర్. కాళేశ్వరానికి లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేశారు.. అప్పుడే క్రాక్స్ వచ్చాయి. పనికిమాలిన రాజకీయాలు తప్ప ప్రజలకు పనికి వచ్చే రాజకీయాలు చేయడం లేదు. తెలంగాణ ప్రజలను దోచుకున్న ముఠా కేసీఆర్ కుటుంబం. రేవంత్ రెడ్డి గ్రామాలకు వెళ్లాలి, ఆయన ఏం శాఖపైనా రివ్యూ చేయడం లేదు. ఎన్నికలు వస్తే ప్రజలు కాంగ్రెస్ భరతం పడతారు. జేసీబీలు ఓల్డ్ సిటీలోకి ఎందుకు పోవడం లేదు? మూసీ ప్రక్షాళన చేయాలి.. చెరువులను పునరుద్ధరించాలి" అని ధర్మపురి అరవింద్ అన్నారు.

## విగ్రహాల మీద ఉన్న ధ్యాస విద్యార్థుల మీద లేదా..

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహాల మీద ఉన్న ధ్యాస విద్యార్థుల మీద లేదా అని మండిపడ్డారు. ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకోవడంపై ఉన్న ధ్యాస, పిల్లల భవిష్యత్తు పై లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా కాదు, కనీసం సొంత జిల్లా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సైతం పట్టించుకోని నిర్లక్ష్యపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్లు జరిగి విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు అని ప్రశ్నించారు. పది రోజులు కాకముందే నేడు వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగి 15 మంది ఆసుపత్రి పాలైన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం సొంత జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే, రాష్ట్ర వ్యాప్తంగా ఇంకెంత దారుణ పరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని అన్నారు. రాష్ట్రంలో వరుస ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నా, విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడక పోవడం దుర్మార్గమని హరీశ్‌రావు మండిపడ్డారు. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలే అయ్యాయని విమర్శించారు. మాటలే తప్ప చేతలు లేని ముఖ్యమంత్రి నిర్లక్ష్య తీరు వల్ల ఇంకెంత మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు కావాలి, ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలని నిలదీశారు.

## కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నాం

- ఎమ్మెల్సీ కవిత



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఉద్యమ తల్లే మా తల్లి.. హస్తం గుర్తు తల్లిని ఆమోదించమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. గ్రాండ్‌గా ఉండే తెలంగాణ తల్లిని తీసి.. బీద తల్లిని పెట్టామని రేవంత్ రెడ్డి గొప్పలు చెప్తున్నాడని అన్నారు. తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదగానే ఉండాలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని చెప్పారు. రేవంత్ పిట్ట బెదిరింపులకు భయపడేవారు ఎవరూలేరన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్పునకు నిరసనగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యమకారులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చింది. జొన్నలు, మక్కలు ఇతర రాష్ట్రాల్లో కూడా పండుతాయి. పూలనే పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణది. తెలంగాణ తల్లి చేతి నుంచి బతుకమ్మను తొలగించారు. తెలంగాణ ప్రత్యేకతే బతుకమ్మ.


మహిళలకేమో విగ్రహాలు.. మగవాళ్లకేమో వరాలా అని ప్రశ్నించారు. తెలంగాణ తల్లిని మార్చి కాంగ్రెస్ తల్లిని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. 9 మంది తెలంగాణ కవులు, కళాకారులకు స్థలాలు, డబ్బులిస్తామన్నరు. గుర్తింపునకు మల్లు స్వరాజ్యం, విమలక్క, సంధ్య పనికిరారా అని ప్రశ్నించారు. గ్రాండ్‌గా ఉండే తల్లిని తీసేసి.. బీద తల్లిని పెట్టినమని రేవంత్ గొప్పలు చెప్తుండు. తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదగానే ఉండాలా అన్ని ప్రశ్నించారు. మీ నోటి నుంచి ఎరుకల నాంచారమ్మ, బీడీ కార్మికుల మహిళల పేరు రాలేదన్నారు. ఉద్యమ కాలంలో ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లిని మార్చారని విమర్శించారు. విగ్రహం పెట్టామని చెప్పి సామన్య మహిళలకు ఇచ్చిన హామీలు ఎగ్గొడతారా అని నిలదీశారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని చెప్పారు. ఉద్యమ తల్లే మా తల్లి.. హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదన్నారు. రేవంత్ పిట్ట బెదిరింపులకు ఎవరూ భయపడరని తెలిపారు.

## పాఠ్యపుస్తకాల్లో రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి విగ్రహం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాల్లో జయ జయహే తెలంగాణ, జననీ జయ కేతనం రాష్ట్ర గీతం పొందుపర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ తల్లి విగ్రహానికి కూడా చోటు కల్పించనుంది. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతంతోపాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన విషయం తెలిసిందే. దీంతో వాటిని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నది. వచ్చే విద్యాసంవత్సరం (2025–26)లో విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి విగ్రహం ముద్రించి ఇవ్వనున్నారు. పాఠ్యపుస్తకాల్లో ప్రతిజ్ఞతోపాటు జాతీయ గీతం జనగణమన, జాతీయ గేయం వందేమాతరం ముద్రిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి వాటితోపాటు రాష్ట్రగీతం, తెలంగాణ తల్లి విగ్రహం కూడా పాఠ్యపుస్తకాల్లో ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేస్తారు. 2014, జూన్ రెండున తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. కానీ పదేండ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ గీతాన్ని అధికారికంగా ప్రకటించలేదు. తెలంగాణ ఉద్యమంలో జయ జయహే తెలంగాణ గీతం ప్రజలందరి మన్ననలు పొందినప్పటికీ అప్పటి ప్రభుత్వం దాన్ని అధికారిక గీతంగా ప్రకటించలేదు. నాటి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించినా అధికారికంగా నిర్ణయం తీసుకోలేదు. ఎలాంటి ఉత్తర్వులను జారీ చేయలేదు. 2023, డిసెంబర్ ఏడున రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. తెలంగాణ గీతంపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించారు. అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం పాటను రాష్ట్ర గీతంగా ఈ ఏడాది ఫిబ్రవరి ఐదో తేదీన క్యాబినెట్ ఆమోదించింది. పూర్తి గీతం 13.30 నిమిషాల నిడివితో ఉన్నది. రాష్ట్ర అధికారిక కార్యక్రమాల్లో ఆలపించడానికి వీలుగా రాష్ట్ర గీతాన్ని 2.30 నిమిషాల నిడివితో మూడు చరణాలతో ఆస్కార్ అవార్డు గ్రహీత ఎంఎం కీరవాణి బృందం ప్రత్యేకంగా స్వరపరిచింది. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ రెండున రాష్ట్ర గీతాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతికి అంకితం చేశారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని డిసెంబర్ తొమ్మిదిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అదేరోజు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి జీవో నెంబర్ 1946ను విడుదల చేశారు. ఏటా తెలంగాణ తల్లి ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేయాలన్న ఆలోచన చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతాన్ని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించడంతో పాఠ్యపుస్తకాల్లో చేర్చుతున్నట్టు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి తనను కలిసిన విలేకర్లకు చెప్పారు. 2026–27 విద్యాసంవత్సరంలో సిలబస్‌లో మార్పులుంటాయని వివరించారు. నేషనల్ కర్రికులమ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్)కు అనుగుణంగా రాష్ట్రస్థాయిలోనూ పాఠ్యాంశాలను రూపకల్పన చేస్తా మని అన్నారు. రాష్ట్రంలో ఉండే ప్రత్యేకతలు, చరిత్ర, సాంస్కృతిక అంశాలను చేర్చే అంశాలను అధ్యయనం చేస్తామని వివరించారు. విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాల్లో తప్పుల నివారణకు జిల్లా స్థాయిలో సబ్జెక్టు నిపుణులతో పరిశీలన చేయించామని చెప్పారు.

## ఆశా వర్కర్లకు అండగా ఉంటా..



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోమని ఆశా వర్కర్లు నిరసన తెలిపితే కనీసం మహిళలు అని కూడా చూడకుండా ఈడ్చుకొని వెళ్తారా? అంటూ రేవంత్ ను నిలదీశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ .. ని పోలీసుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఆశావర్కర్లను ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం పరామర్శించారు.. వారికి ధైర్యం చెప్పారు.. వారు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు ఇస్తునట్లు చెప్పారు.

ఆనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పోలీసులతో రేవంత్ సర్కార్ చేసిన దుశ్శాసన పర్వం తెలంగాణ ఆడబిడ్డలు మరిచిపోరన్నారు. తగిన సమయంలో ఆడబిడ్డలు కాంగ్రెస్ కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. హామీల అమలుకు ఆశా వర్కర్లు ఆందోళన చేస్తున్నారని.. నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు.

కరోనా సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఆశావర్కర్లు సేవలందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు ఆందోళన చేపట్టారని వివరించారు. వారిపై జరిగిన దౌర్జన్య ఘటనపై మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్లో ఫిర్యాదు చేస్తామన్నారు కెటిఆర్ . ఆడబిడ్డలపై చేయి చేసుకున్న పోలీసులను డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు.. ఆశా వర్కర్ల తరపున ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తామని తేల్చి చెప్పారు. వారికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం అని కేటీఆర్ అన్నారు.

## గిరిజన పాఠశాలలో ఫుడ్ పాయిజన్






- వికారాబాద్ జిల్లా తాండూరులో ఘటన

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వికారాబాద్ జిల్లా తాండూరు గురుకుల పాఠశాల హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కలుషిత ఆహారం తినడంతో దాదాపు 15 మంది వరకు అస్వస్థతకు గురవగా.. వారిని వెంటనే ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగినట్లు తెలుస్తున్నది. తాండూరు టౌన్‌లోని సాయిపూర్‌లో బాలిక గురుకుల హాస్టల్ కొనసాగుతున్నది. అయితే, గత కొద్దిరోజులుగా వసతిగృహంలో అందిస్తున్న భోజనం నాణ్యత సరిగా లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అన్నంలో పురుగులు వస్తున్నాయని.. మెత్తగా ఉండడంతో పాటు నీళ్ల చారు వడ్డిస్తున్నారన్నారు. తాజాగా ఈ నెల 9న రాత్రి భోజనం తిన్న 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఘటన తర్వాత తాండూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో హైకోర్టు సైతం ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మళ్లీ ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా.. మళ్లీ ఈ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.


## రాజ్యసభ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం..




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఎగువ సభలో చైర్మన్ వ్యవహరిస్తున్న తీరు ఏకపక్షంగా ఉంటోందని ఎంపీలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. రాజ్యసభ నుంచి తాము తరచూ వాకౌట్ చేయాల్సిన పరిస్థితికి చైర్మన్ ధన్‌ఖర్ వైఖరే కారణమని విపక్ష ఎంపీలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై ఇండియా కూటమి పార్టీలైన తృణమూల్, ఆమ్ ఆద్మీపార్టీ, సమాజ్ వాదీపార్టీ, డీఎంకే, ఆర్జేడీ తదితర పార్టీలకు చెందిన 50 మందికిపైగా ఎంపీలు సంతకాలు చేశారు. ఎంపీలు సంతకాలు చేసిన ఈ నోటీసులను రాజ్యసభ సెక్రటేరియట్‌కు సమర్పించారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం భారత పార్లమెంటరీ చరిత్రలోనే ఇది మొదటిసారి. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు లేచి నిలబడినపుడు చైర్మన్ ఆయనకు అవకాశం ఇవ్వాలని, కాని కాంగ్రెస్ అధ్యక్షుడు, సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే లేచి నిలబడగానే మైక్రోఫోన్‌ను చైర్మన్ తరచు కట్ చేస్తున్నారని విపక్ష ఎంపీలు వాదిస్తున్నారు. పార్లమెంటరీ నిబంధనలు, సాంప్రదాయాల ప్రకారం సభ నడవాలని, కాని తాము ఫిర్యాదు చేసిన ప్రతిసారి తమను ఛాంబర్‌లోకి పిలిచి సర్దుబాటు చేసేందుకు చైర్మన్ ప్రయత్నిస్తున్నారే తప్ప నిబంధనలను పాటించాలని భావించడం లేదని సీనియర్ ప్రతిపక్ష నాయకుడు ఒకరు తెలిపారు.

## మంచు కుటుంబంలో ముదురిన గొడవలు





- మీడియాపై దాడి చేసిన మోహన్‌బాబు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మంచు కుటుంబంలో గొడవలు రోజు రోజుకు ముదురుతున్నాయి. మంగళవారం మోహన్‌బాబు ఇంటి వద్ద ఉదయం నుంచి రాత్రి నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఫహడీషరీఫ్ పోలీసులు మంగళవారం ఉదయం జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటికి వచ్చి అక్కడ పనిచేస్తున్న వారిని విచారించారు. ఇదిలా ఉండగా మంచు విష్ణు విదేశాల నుంచి ఇంటికి రాగానే మోహన్ బాబుతో కలిసి మంచు మనోజ్ అతని భార్యని ఇంటి నుంచి బయటికి పంపించినట్టు

మిగితా 2వ పేజీలో

# ప్రభుత్వ నిర్మాణ, స్థానిక అవసరాలకు ఇసుక రీచ్ లు గుర్తించాలి..




- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

ప్రభుత్వ నిర్మాణ, స్థానిక, వాణిజ్య అవసరాలకు ఇసుక రీచ్ లు గుర్తించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.మంగళవారం డిస్ట్రిక్ట్ లెవెల్ శ్యాండ్ కమిటీ మీటింగ్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జీఓ నెంబర్ 3, టీజీ ఎండీసీ లక్ష్యం తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో ఎన్ని ఇసుక రీచ్ లు ఎన్ని ఉన్నాయో,ప్రస్తుతం క్యూబిక్ మీటర్ ఇసుకకు రూ. 100 ఉండగా, రూ.160 కి పెంచాలని కమిటీ ప్రతిపాదనలు చేశారు. చెక్ డ్యాంల నిర్మాణాలకు ఇబ్బంది కాకుండా ఇసుక తీయాలని ఆదేశించారు. పీ.సీ.బీ ఇతర శాఖల సమన్వయంతో ఇసుక తరలించాలనిఅన్నారు . ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి, మైనింగ్ అధికారి క్రాంతి కుమార్, డీ.ఆర్డీ.ఓ శేషాద్రి, డీ.టీ.ఓ. లక్ష్మణ్, జిల్లా ఇరిగేషన్ అధికారి అమరేందర్ రెడ్డి, సర్వే ఏడీ వినయ్ కుమార్, మిషన్ భగీరథ ఈఈ జానకి తదితరులు పాల్గొన్నారు.

# ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా పీడిత పాలన : కేటీఆర్

**బలగం టీవీ , హైదరాబాద్**

%కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. అదానీ వ్యతిరేక నిరసనల్లో కాంగ్రెస్ ద్వంద్వవైఖరి పాటిస్తోందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో ఒకలా, తెలంగాణ అసెంబ్లీలో మరోలా వ్యవహరిస్తోందని ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు.రాహుల్ జీ..ఇది ఎలాంటి వంచన..? పార్లమెంట్‌లో అదానీ మోదీ ఫొటో ఉన్న టీషర్ట్ ధరించడం మీకు సరైనదే అయితే.. మీ అడుగుజాడల్లో నడిచి తెలంగాణ అసెంబ్లీలో అదానీ రేవంత్ వ్యవహారాన్ని బయటపెట్టడానికి మాకు ఎందుకు అనుమతి లేదు..? దీనికి సమాధానం చెప్పండి' అంటూ రాహుల్‌గాంధీని కెటిఆర్ నిలదీశారు. ఈ మేరకు రాహుల్.. మోదీ – అదానీ చిత్రాలతో ఉన్న టీషర్టును ధరించిన ఫొటోలను కెటిఆర్ పోస్టు చేశారు.

ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా పీడిత పాలన అని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజల వేదన అరణ్య రోదనగానే మిగిలిందని విమర్శించారు. రైతులను చెరబట్టారని, పేదల ఇండ్లు కూలగొట్టారని ధ్వజమెత్తారు. రైతుబంధు ఎత్తేశారని, రైతుభీమాకు పాతరేశారని, కెసిఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ మాయం చేశారని, అమ్మవడిని ఆగం చేశారని దుయ్యబట్టారు. నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారని, ఏక్ పోలీస్ అన్న పోలీసులను అణగదొక్కారని చెప్పారు.

హామీల అమలు అడిగిన ఆడబిడ్డలు, ఆశాలను అవమానించారని మండిపడ్డారు. టీఎస్ టీజీగా చేసి చార్మినార్, కాకతీయ కళాతోరణాలను తొలగించారన్నారు. తెలంగాణ బిడ్డలు లాఠీలకు, తూటాలకు ఎదురొడ్డి ఆత్మబలిదానాలతో ఉద్యమిస్తున్నప్పుడు.. సమైక్యవాదుల పంచనచేరి వంచన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార అహంకారంతో ఇప్పుడు ఏకంగా అమ్మనే మార్చారని విమర్శించారు. చరిత్రను చెరిపేస్తామన్న భ్రమలో తెలంగాణ ప్రజలను ఏమారుస్తాం అనుకుంటే పొరపాటేనని చెప్పారు. తెలంగాణ అన్నీ గమనిస్తున్నది, కాలంబు రాగానే కాటేసి తీరుతుందని కెటిఆర్ ట్వీట్ చేశారు.

## శాసనసభ్యుల అవగాహన తరగతులు బహిష్కరిస్తున్నాం : కేటీఆర్

**బలగం టీవీ , హైదరాబాద్**

రేపటి నుంచి జరిగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అవగాహన తరగతులను బహిష్కరించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. తమ హక్కులకు భంగం కలిగేలా స్పీకర్ వ్యవహరించారని కేటీఆర్ తెలిపారు. తొలిరోజే తమను లోపలికి రాకుండా అరెస్టు చేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలు ఎత్తిచూపితే అరెస్టు చేశారని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ పార్టీ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారని కేటీఆర్ అన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనూ తమ గొంతు నొక్కేలా వ్యవహరించారని తెలిపారు. తమకు అవకాశం ఇవ్వకుండా స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరించారని పేర్కొన్నారు. తమ శాసనసభ్యుల్లో అతి తక్కువ మంది మాత్రమే కొత్త వాళ్లు ఉన్నారని తెలిపారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న స్పీకర్ వ్యవహారశైలికి నిరసనగా రేపటి నుంచి జరగనున్న అవగాహన తరగతులను బహిష్కరిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా ఎలాంటి వివక్ష లేకుండా వ్యవహరించాలని స్పీకర్‌ను విజ్ఞప్తి చేశారు.

## 'లక్కీభాస్కర్' చూసి నలుగురు విద్యార్థులు అదృశ్యం

**బలగం టీవీ , హైదరాబాద్**

లక్కీభాస్కర్ సినిమా చూసిన నలుగురు విద్యార్థులు అదృశ్యమయ్యారు. ఆ నలుగురు విద్యార్థులు విశాఖలోని మహారాణిపేటలో ఓ హాస్టల్ నుంచి పరారయ్యారు. లక్కీభాస్కర్ సినిమాలో హీరో లాగా ఇల్లు, కార్లు సంపాదించి తిరిగొస్తామని ఫ్రెండ్స్ కు చెప్పిన ఆ విద్యార్థులు హాస్టల్ వదిలి వెళ్లిపోయారు. పరారైన విద్యార్థులను కిరణ్ కుమార్, కార్తీక్, చరణ్ తేజ, రఘు అని గుర్తించారు. వీరు సెయింట్స్ ఆన్స్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నారు. కాగా, విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థుల ఎటు వెళ్లారో తెలుసుకునేందుకు రైల్వే స్టేషన్, బస్టాండ్ లోని సీసీటీవీ ఫుటేజిని పరిశీలిస్తున్నారు.

# సిద్దిపేటలో వెంకన్న ఆలయం



**బలగం టీవీ , హైదరాబాద్**

టీటీడీ చైర్మన్‌కు హరీశ్‌రావు విజ్ఞప్తి %ఖుతీఅంష్ట్ర క్షుఖుశీ% ఎ కలియుగ ప్రత్యక్ష దైవంగా కొలిచే తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సిద్ధిపేటలో కొలువు దీరనుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. మంగళవారం తిరుపతి వెళ్లిన హరీశ్ రావు టీటీడీ బోచైర్మన్ బీఆర్ నాయుడిని కలిశారు. సిద్ధిపేట కోమటి చెరువు ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయ నిర్మాణం చేపట్టాలని కోరారు.

వేంకటేశ్వర ఆలయ నిర్మాణం కోసం సిద్ధిపేట కోమటి చెరువు ప్రాంతంలో 5 ఎకరాల 10 గుంటల స్థలాన్ని మంజూరు చేశామని టీటీడీ చైర్మన్‌తో హరీశ్‌రావు తెలిపారు. గతం లోనే టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు పర్యటించి ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. దానికి అనుగుణంగా ఆలయ నిర్మాణ నమునా, డిజైన్స్ ను రూపొందించారని వివరించారు.

తిరుపతి వేంకటేశ్వర స్వామి అంటే ప్రజలు ఇష్ట దైవంగా.. ఇలవేల్పుగా కొలుస్తారని, అలాంటి ఆలయం సిద్ధిపేటలో నిర్మించడం గొప్ప అదృష్టమని హరీశ్‌రావు అన్నారు. వచ్చే టీటీడీ బోర్డు మీటింగ్‌లో సిద్ధిపేటలో వెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి ఆమోదం తెలిపి, మీరే ఆలయ నిర్మాణ పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా బీఆర్ నాయుడిని కోరారు. అందుకు చైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించారు. వెంటనే చీఫ్ ఇంజనీర్ అధికారి, సంబంధిత అధికారులను పిలిచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.



# గిరిజన కళాశాల సందర్శన

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ నాక్ బృందం సందర్శించి వివిధ విషయాలపై అధ్యయనం చేసినట్లు ప్రిన్సిపల్ రెహానా ఇఫత్ తెలిపారు. కళాశాలలో అందుతున్న సదుపాయాలు బోధన పద్ధతులు అవలంబిస్తున్న విధానాలను పరిశీలించారని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయని అధ్యయనం చేశారని నాణ్యత ప్రమాణాల ఆధారంగా గ్రేడ్ కేటాయించేందుకు నివేదికను షీల్డ్ కవర్లో బెంగళూరులోని నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయానికి పంపారని ప్రిన్సిపల్ వివరించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ,ఐక్య సి కోఆర్డినేటర్ టీచింగ్,నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంచు కుటుంబంలో ముదురిన గొడవలు

(మొదటి పేజీ తరువాయి)

తెలిసింది. అనంతరం మంచు మనోజ్ విలేకరులతో మాట్లాడుతూ తనకు ఆస్తి పై ఎలాంటి ఆశ లేదని తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. పోలీసులు ఒకవైపే మాట్లాడటం సమంజసం కాదన్నారు. తన వెంటే ఉన్న బౌన్సర్లను పంపించేసి, తనను ఇంటి నుంచి బయటికి పంపించడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. న్యాయం జరిగేంత వరకు ప్రపంచంలో ఉన్న అందర్నీ కలుస్తానని మంచు మనోజ్ మోహన్ బాబు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మనోజ్ సాయంత్రం డీజీపీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశాడు. డీజీపీ, ఇంటలిజెన్స్ డీజీలను కలిసి జరిగిన ఎపిసోడ్‌ను వివరించాడు. అనంతరం ఆయన నేరుగా జల్‌పల్లి వెళ్లిపోయారు. జల్‌పల్లిలో ఇంటి వద్ద గేట్లన్ని మూసి ఉండగా మీడియా ప్రతినిధులంతా బయట ఉన్నారు. డోర్లు తీయాలంటూ మనోజ్ గట్టిగా అరిచారు, అయినా ఎవరూ స్పందించలేదు. తన కూతురు ఇంట్లో ఉందని, తాను తీసుకెళ్తానంటూ అరిచాడు. ఆలస్యమవుతుండడంతో బౌన్సర్లతో కలిసి గేట్లను బద్దలు కొట్టి లోపలికి కారులో వెళ్లిపోయారు. అప్పటికే లోపల ఉన్న ప్రయివేటు సైన్యం(బౌన్సర్లు) మనోజ్‌ను, మీడియాను అడ్డుకోవడానికి ప్రయత్నించింది. అయితే మనోజ్ వాళ్లను నెట్టేస్తూ ముందుకు సాగాడు, ఒకనొక సమయంలో ఒక బౌన్సర్‌ది గొంతు పట్టాడు. ఇంతలో మోహన్‌బాబు ఇంట్లో నుంచి బయటకు వస్తూ మనోజ్‌ను చూసి ఆగ్రహంతో ఊగిపోయాడు. అతనిపై చేయి చేసుకుంటూ మీడియాను దూషిస్తూ చంపేస్తానంటూ తుపాకీ సైతం తీశాడు. మనోజ్‌పై తండ్రి చేయి చేసుకోవడంతో షర్ట్ చినిగింది, దీంతో మనోజ్ తన చినిగిన అంగీతో అక్కడే మీడియా ముందకు తిరుగుతూ కనిపించాడు. మోహన్‌బాబు ముందుకు వస్తుండగా ఒక మీడియా ప్రతినిధి ప్రశ్నించేందుకు ప్రయత్నించగా అతని చేతిలో ఉన్న టీవీ లోగో తీసుకొని దాడి చేశాడు. అంతకు ముందు అక్కడున్న బౌన్సలర్లు మీడియా ప్రతినిధులను బయటకు నెట్టేయడంతో పలువురికి గాయలయ్యాయి. పోలీసుల ఎదుటే మోహన్‌బాబు మీడియాపై దాడి చేయడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు కూడా మోహన్‌బాబు, మనోజ్‌ల వద్ద ఉన్న లైసెన్స్‌డ్ తుపాకులను వెనక్కి తీసుకోవడానికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరిస్థితి చేయి దాటిపోతుండడంతో భారీ ఎత్తున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మరల ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి, పహాడీ షరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### నా పరువు తీశావు మనోజ్ : మోహన్‌బాబు

జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి వద్ద ఉద్రిక్తత పరిస్థితుల అనంతరం మోహన్‌బాబు ఒక ఆడియోను విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ "మనోజ్ నిన్ను అల్లారుముద్దుగా పెంచాను, చదువు కోసం చాల ఖర్చు పెట్టాను, భార్య మాటలు విని నా గుండెలపై తన్నావు. తాగుడుకు అలవాటు పడి చెడు మార్గంలో వెళ్తున్నావు. కొన్ని కారణాల వల్ల ఇద్దరం ఘర్షణ పడ్డాం. ప్రతి ఇంట్లో గొడవలు ఉంటాయి. ఇంట్లో అందరినీ ఎందుకు కొడుతున్నావు, బతుకుదెరువు కోసం వచ్చిన పనివాళ్లను కొట్టడం మహాపాపం. నీ దాడిలో కొందరికి గాయాలయ్యాయి, అయినా కాపాడాను. విద్యా సంస్థల్లో ప్రతిది లీగల్‌గా ఉంది, తప్పులు ఎక్కడా జరుగలేదు, అన్నతో పాటు వినయ్‌ని కొట్టడానికి వచ్చావు, నీ అన్నను చంపుతానని అన్నావు. నా ఇంట్లోకి అడుగు పెట్టడానికి నీకు అధికారం లేదు, ఇది నా కష్టార్జితంతో కట్టుకున్న ఇళ్లు, రోడ్డుకెక్కి నా పరువు తీశావు. ఆస్తులు ముగ్గురి సమానంగా రాయాలా? వద్దా? అనేది నా ఇష్టం, పిల్లలకు ఇస్తానా? దాన ధర్మాలు చేస్తానా? అనేది నా ఇష్టం, మా నాన్న నాకు ఆస్తులు ఇవ్వలేదు, అయినా నేను సంపాదించుకున్న. మనోజ్ నన్ను కొట్టలేదు, మేమిద్దరం ఘర్షణ పడ్డాం, నా ఇంట్లోకి అక్రమంగా చొరబడ్డావు, నాకు రక్షణ కావాలని పోలీసులను కోరాను, నీ కూతురిను వచ్చి తీసికెళ్లు, నా దగ్గర వదిలిపెట్టినా ఇబ్బంది లేదు, జరిగిన సంఘటనతో మీ అమ్మ ఆస్పత్రిలో చేరింది, పోలీసుల సమక్షంలోనే నీ బిడ్డను నీకు అప్పగిస్తా" అని తెలిపారు.

### మోహన్ బాబు, విష్ణు, మనోజ్ లకు రాచకొండ సీపీ నోటీసులు

మీడియా ప్రతినిధులపై దాడి నేపథ్యంలో ప్రముఖ నటుడు మోహన్ బాబుకు రాచకొండ సీపీ సుధీర్ బాబు నోటీసులు జారీ చేశారు. రేపు ఉదయం గం.10.30కు విచారణకు హాజరు కావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. మంచు మనోజ్, మంచు విష్ణులకు కూడా విచారణకు రావాలంటూ నోటీసులు జారీ చేశారు. మరోవైపు, రాచకొండ పోలీసుల ఆదేశాల మేరకు మోహన్ బాబు, మంచు మనోజ్ లైసెన్స్ డ్ తుపాకులను ఫిలింనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, తన ఇంటి వద్ద జర్నలిస్టుల మీద మోహన్ బాబు దాడి చేసినట్లుగా ఉన్న వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

నటుడు మోహన్ బాబు గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చేరారు. ఆయనకు ఆసుపత్రి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. తన పెద్ద కొడుకు మంచు విష్ణుతో కలిసి ఆయన కాంటినెంటల్ ఆసుపత్రికి వెళ్లారు. మరోవైపు, జర్నలిస్టులపై మోహన్ బాబు దాడిని నిరసిస్తూ పలువురు జర్నలిస్టులు కాంటినెంటల్ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



# ఆశా వర్కర్‌ల ముందస్తు అరెస్ట్

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

చలో అసెంబ్లీకి తరలి వెళ్తున్న ఆశా వర్కర్లను పోలీసులు అడ్డుకొని తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల వేతనాలు ప్రస్తుతం 9000 రూపాయలు ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో పెట్టిన విధంగా అధికారం రాగానే18000 రూపాయల వేతనంతో పాటు ఈఎస్ఐ,పిఎఫ్,హెల్త్ ఇన్సూరెన్స్, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి నేటి వరకు అమలు చేయలేదని వెంటనే అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడి వెళ్తున్న వారిని అరెస్ట్ చేయడం విడ్డూరమన్నారు.ఈ కార్యక్రమంలో హెప్సీ, భూలక్ష్మి, రుచిత,మానస,హఫీజ, లావణ్య, పద్మ, కమల, స్వప్న, మంగ,సుజాత తదితరులు పాల్గొన్నారు.



# గూడ్స్ యూనియన్ ఏకగ్రీవ ఎన్నిక

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం కేంద్రంలోని గూడ్స్ యూనియన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రెడ్డి పరశురాములు, ఉపాధ్యక్షులు కందికట్ల సాయికుమార్, ప్రధాన కార్యదర్శి రంగు బాలరాజు, క్యాషియర్ బోద్దుల గణేష్, సహాయ కార్యదర్శి గౌరవేణి రాజు, సభ్యులు రోడ్ల మధుకర్ రెడ్డి, శివాజీ, అంజయ్య, ప్రశాంత్, లింగం,భాస్కర్ దాస్, రాజు, బాలకృష్ణ,వినయ్, నరసింహులు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# బైక్ దొంగలు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

- **వేములవాడ ఏఎస్పీ శేశాద్రిని రెడ్డి**

**బలగం టీవీ , వేములవాడ**



ఏఎస్పీ శేశాద్రిని రెడ్డి

బైకు దొంగలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ ఏఎస్పీ శేశాద్రిని రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శేశాద్రిని రెడ్డి మాట్లాడుతూ కోనరావుపేట మండలం రామన్న పేట గ్రామానికి చెందిన దుద్దేటి వేణు కారు నడుపుకుంటూ జీవిస్తాడు, డబ్బులు సరి పోకపోవడంతో,ఎలాగైనా డబ్బులు సంపాదించాలని రామన్నపేట గ్రామానికి చెందిన మామిండ్ల రాకేష్ తో కలిసి వేములవాడ రూరల్ మండలంలోని బాలరాజు పల్లి గ్రామం లో ఓ ఇంటి ముందు వున్న ఆర్1 5 బ్లూ కలర్ టీ ఎస్ %ూ23 జు% 7101 నెంబర్ గల బైకును దొంగతనం చేసి దాచి పెట్టినాడని తెలిపారు. వేణు, రాకేష్ లు అదే గ్రామానికి చెందిన గరువుల దేవేందర్ తో కలిసి ఫిబ్రవరి నెలలో వేములవాడలోని రెండవ బైపాస్ నల్ల పోచమ్మ రోడ్డు వద్ద టీ ఎస్ 23 8557 పల్సర్ బండిని, 2024 మర్చి లో సిద్దిపేట లో ఆర్ 1 5 -%ూ 08 జీచీ% 8732 బైక్ దొంగతనం చేశారని తెలిపారు. అట్టి బైకులను అమ్ముటకు కోరుట్ల కు వెళుతుండగా మరిపల్లి వద్ద వేములవాడ రూరల్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, వారిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించామని తెలిపారు.

## పవన్ కల్యాణ్ ఆఫీసుకు బెదిరింపు కాల్స్ చేసిన వ్యక్తి అరెస్ట్

**బలగం టీవీ , అమరావతి**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను చంపేస్తానంటూ ఆయన కార్యాలయానికి ఓ వ్యక్తి బెదిరింపు కాల్స్ చేసిన వ్యక్తిని తిరువూరుకు చెందిన నూక మల్లికార్జునరావుగా గుర్తించారు. ఉప ముఖ్యమంత్రికి బెదిరింపు కాల్స్ రావడంతో వెంటనే స్పందించిన హెూంమంత్రి అనిత పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో, పవన్ కు బెదిరింపు కాల్స్ చేసిన మల్లికార్జునరావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వ్యక్తి బందరు రోడ్డులోని ఇందిరాగాంధీ స్టేడియం సమీపం నుంచి పవన్ పేషీకి కాల్ చేసినట్టు గుర్తించారు. అభ్యంతరకర భాషతో కూడిన సందేశం కూడా పంపాడు. తాజాగా అతడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఎందుకు ఇలా కాల్ చేయాల్సి వచ్చింది? దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. కాగా, నూక మల్లికార్జునరావు మానసిక స్థితి సరిగా లేదని తెలుస్తోంది. అతడు మద్యం మత్తులో బెదిరింపు కాల్స్ చేసినట్టు భావిస్తున్నారు.

# 17న తుది పోలింగ్ కేంద్రాల ప్రచురణ..

- **డిసెంబర్ 12 లోపు పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలను సమర్పించాలి..**
- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం గుర్తించిన పోలింగ్ కేంద్రాల పై ఉన్న అభ్యంతరాలను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు డిసెంబర్ 12 లోపు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీక్ష నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న 260 గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాల వివరాలు అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ మన రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం 260 గ్రామాలలోని 2268 వార్డులలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 2268 పోలింగ్ కేంద్రాలను గుర్తించి డ్రాఫ్ట్ జాబితా విడుదల చేశామని, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ జాబితాను పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 12 లోపు తెలియజేయాలని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 200 ఓటర్ల వరకు 1734 పోలింగ్ కేంద్రాలు , 400 ఓటర్ల వరకు 468 పోలింగ్ కేంద్రాలు ,650 ఓటర్ల వరకు 76 పోలింగ్ కేంద్రాలు, మొత్తం 2268 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఈ వివరాలను పార్టీల కార్యకర్తలకు అందజేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు సందేహాలు ఉంటే తెలియజేయాలని అన్నారు.

డిసెంబర్ 13న అభ్యంతరాల పై సంబంధిత మండలాల ఎంపీడీఓ అధికారులు స్క్రూట్ ని పూర్తి చేసి నివేదిక అందించాలని, డిసెంబర్ 16 లోపు జిల్లా కలెక్టర్ ఆమోదంతో తుది నిర్ణయం తీసుకొని డిసెంబర్ 17న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎంపీడీ ఓల ద్వారా తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి డిపివో శేషాద్రి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సి.హెచ్ ప్రకాష్, బీఆర్ఎస్ ప్రతినిధి రాజన్న, భాజపా ప్రతినిధి గోపి, సిపిఎం ప్రతినిధి రాజశేఖర్, టిడిపి ప్రతినిధి , వివిధ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో గెలుపు ఓటములు సహజం...

**-మున్సిపల్ చైర్మన్ జిందం కళాచక్రపాణి**

**బలగం టీవీ , సిరిసిల్ల**

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, గెలుపు ఓటములను విద్యార్థులు సమానంగా స్వీకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి అన్నారు.మంగళవారం సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపల్ లెవెల్ సీఎం కప్-2024 క్రీడల పోటీలను మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జిందం కళాచక్రపాణి మాట్లాడుతూ ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ లెవెల్ సీఎం కప్ -2024 క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని గెలిచినవారు,రాబోయే కాలంలో రాష్ట్రస్థాయి,జాతీయస్థాయి మరియు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని, భవిష్యత్తులో మన ప్రాంతానికి, మీ ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఓడిపోయినవారు



ఓటమిని గెలుపుకు తొలిమెట్టుగా భావించి నిరుత్సాహపడకుండా, మరింత క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకొని వారి లక్ష్య సాధన దిశగా కృషి చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ డీ. లావణ్య, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్ ,ఏ ఎం సిచైర్మన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి , వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్ పి ఈ టీ లు దేవత ప్రభాకర్ , తిరుపతి , జగన్ పాల్గొన్నారు..

# అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి...



**బలగం టీవీ , వేములవాడ :**

వేములవాడ పట్టణంలో అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వేములవాడ అంబేద్కర్ విగ్రహ డెవలప్మెంట్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం వేములవాడ పట్టణంలోని భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ డిజైన్ మార్పు కొరకే అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములవాడ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తా కొరకు రూపొందించిన డిజైన్ను మార్చాలని, అంబేద్కర్ విగ్రహ అభివృద్ధికి పై ఉన్న వివిధ అభిప్రాయాలను తొలగించాలని అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించుకున్నామన్నారు. అంబేద్కర్ విగ్రహ చౌరస్తా సుందరీకరణ డిజైన్ కొరకు ప్రజా సంఘాల అభిప్రాయాన్ని వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సేకరించాలని అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహాన్ని 1995లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చేతులమీదుగా ఆవిష్కరించబడినదని, అప్పటినుండి విగ్రహాన్ని అభివృద్ధి చేయకపోవడం చాలా బాధాకరమనిఅన్నారు.ఇప్పుడు చేస్తున్న అంబేద్కర్ గార్డెన్ సెంటర్ పాయింట్ లో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనివారు డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ కౌన్సిలర్లు నిమ్మిశెట్టి విజయ్, సిరిగిరి రామచందు, గోలి మహేష్, దుమ్మ ఆనంద్, సంటి అంజిబాబు, గుండా థామస్, మూలే కిషోర్, బొడ్డు రాములు, జక్కల యాదగిరి, జింక శ్రీధర్, సిరిగిరి శ్రీకాంత్, పిట్టల సతీష్, లింగంపల్లి కిరణ్, గుడిసె మనోజ్ కుమార్, వంకయాల మహేశ్వర్, తాళ్లపల్లి నాగరాజ్, బొజ్జ చంద్రమోహన్, చర్ల రమేష్, చర్ల బాలు, ఆర్ ఎం వేణుగోపాల్, గుడిసె అరుణ్, కొల్లురి అమర్, జింక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# నా కల నెరవేరింది : మహేశ్ బాబు

బలగం టీవీ, హైదరాబాద్



హాలీవుడ్ సూపర్ హిట్ బ్లాక్ బస్టర్ ది లయన్ కింగ్ ప్రాజెక్టుకు ప్రీక్వెల్ వస్తోంది ముఫాసా: ది లయన్ కింగ్. ఈ క్రేజీ మూవీ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఈ మూవీ తెలుగు వెర్షన్ ముఫాసా పాత్రకు టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్ బాబు వాయిస్ అందించాడు. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో తన ఎక్జయిట్‌మెంట్‌ను సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకున్నారు మహేశ్ బాబు.

ముఫాసా ఇప్పటివరకూ వచ్చిన అత్యంత పాపులర్ పాత్రల్లో ఒకటని, తనకు ఇష్టమైన పాత్ర అని చెప్పారు. 'నేను ఎప్పట్నుంచో చూస్తున్న పాత్ర ముఫాసా. తన కుటుంబాన్ని ముఫాసా చూసుకునే తీరు నిజంగా అద్భుతం. ఆ పాత్రకు డబ్బింగ్ చెప్పడం గౌరవంగా భావిస్తున్నా. ముఫాసాకు డబ్బింగ్ చెప్పడంతో నా కల నెరవేరినట్టయ్యింది.' అని మహేశ్ బాబు తెలిపారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళం భాషల్లో విడుదల కానుంది.




## వీక్ డేలోనూ 'పుష్ప 2'కు భారీ వసూళ్లు

బలగం టీవీ, హైదరాబాద్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' చిత్రం బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లను అందుకుంటూ అదరగొడుతోంది. డిసెంబరు 5న ప్రపంచ వ్యాప్తంగా ఆరు భాషల్లో విడుదలైన ఈ చిత్రం ఇప్పుడు ఐదు రోజుల్లోనే రూ.900 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఈ చిత్రం ఐదు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా రూ.922 కోట్ల గ్రాస్ సాధించినట్లు మూవీ టీమ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. "రూ.900 కోట్లు సాధించిన అత్యంత వేగంగా అందుకున్న సినిమా ఇది. ఇండియన్ సినిమాలోనే రికార్డ్ బ్రేకింగ్ ఫిల్మ్." అని రాసుకొచ్చింది.



## 'నానా హైరానా' పాటకు 47 మిలియన్ల వ్యూస్

బలగం టీవీ, హైదరాబాద్


గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో వస్తున్న చిత్రం గేమ్ చేంజర్. ఈ చిత్రం 2025 జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ భారీ బడ్జెట్ చిత్రం నుంచి ఇటీవలే నానా హైరానా అనే మెలోడియస్ సాంగ్ ఆడియన్స్ ముందుకు వచ్చింది. ఈ పాట యూట్యూబ్‌లో ఇప్పటికే 47 మిలియన్ వ్యూస్‌కు (తెలుగు, తమిళ్, హిందీ) దక్కించుకుంది. ఈ ఫ్యూజన్ మెలోడీ గీతాన్ని రామ్ చరణ్, కియారాలపై న్యూజిలాండ్ లోని బ్యూటిఫుల్ లొకేషన్లలో ఆరు రోజుల పాటు చిత్రీకరించారు. హైదరాబాద్ నుంచి ఆక్లాండ్ వెళ్లిన రామ్ చరణ్... అక్కడ్నించి హెలికాప్టర్ లో క్రైస్ట్ చర్చ్ నగరానికి వెళ్లారు. అక్కడి కనువిందు చేసే లొకేషన్లలో కియారాతో ఆడిపాడారు. ఈ పాటలో రామ్ చరణ్, కియారా జోడీ ప్రఖ్యాత డిజైనర్ మనీశ్ మల్హోత్రా రూపొందించిన దుస్తుల్లో కనువిందు చేశారు. ఈ పాట కోసం మేకర్స్ దాదాపు రూ.10 కోట్లు ఖర్చు చేశారు. ఆలిమ్ హకీమ్ ఫ్యాషనబుల్ హెయిర్ స్టయిలింగ్ తో రామ్ చరణ్ సరికొత్తగా కనిపిస్తున్నాడు.




## ఓటీటీలోకి విక్రమ్ తంగలాన్

బలగం టీవీ, హైదరాబాద్

కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ కాంపౌండ్ నుంచి వచ్చిన చిత్రం తంగలాన్. హిస్టారికల్ డ్రామాగా పా రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతి తిరువొత్తు ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషించగా.. పశుపతి, డానియెల్ కల్టగిరోన్ కీలక పాత్రలు పోషించారు. ఆగస్టు 15న తెలుగు,తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తాజాగా ఈ సినిమా ఓటీటీ ప్రీమియర్ అప్‌డేట్ వచ్చేసింది. 100 రోజుల తర్వాత ఓటీటీలోకి వచ్చేసింది. ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో ప్రీమియర్ అయింది. ప్రస్తుతం తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. మరి ఓటీటీలో తంగలాన్‌కు ప్రేక్షకులను ఎలాంటి స్పందన వస్తుందనేది చూడాలి.



## చివరి షెడ్యూల్‌లో 'హరిహర వీరమల్లు

బలగం టీవీ, హైదరాబాద్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'హరిహర వీరమల్లు' సినిమాను దర్శకుడు జ్యోతికృష్ణ డైరెక్ట్ చేస్తుండగా పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు రెడీ అవుతుంది. అయితే, ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం చివరి షెడ్యూల్ జరుపుకుంటోంది. ఈ షెడ్యూల్‌లో పవన్ కళ్యాణ్ కూడా పాల్గొంటున్నారు. ఈ చివరి షెడ్యూల్‌లో పవన్ కళ్యాణ్ యాక్షన్ మోడ్‌లోకి మారాడు. దీనికి సంబంధించిన ఓ వర్కింగ్ స్టిల్‌ను చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఇక ఈ షెడ్యూల్‌తో ఈ భారీ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ముగుస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ విలన్ పాత్రలో నటిస్తుండగా నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని మార్చి 28న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.




## బాక్సింగ్ డే టెస్టు తొలి రోజు టికెట్లు సోల్డ్ అవుట్

బలగం టీవీ, మెల్‌బోర్న్

ఆస్ట్రేలియా, ఇండియా మధ్య జరిగే నాలుగవ టెస్టు బాక్సింగ్ డే టెస్టుకు చెందిన తొలి రోజు టికెట్లు పూర్తిగా అమ్ముడుపోయాయి. డిసెంబర్ 26వ తేదీన నాలుగవ టెస్టు ప్రారంభంకానున్నది. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరుగుతున్న టెస్టు సిరీస్‌లో.. ఇరు జట్లు చెరో విజయాన్ని నమోదు చేశాయి. తొలి టెస్టును ఇండియా గెలుచుకోగా, రెండో టెస్టును ఆసీస్ సొంతం చేసుకున్నది. శనివారం నుంచి బ్రిస్బేన్‌లో మూడవ టెస్టు ప్రారంభంకానున్నది. అయితే మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే బాక్సింగ్ డే టెస్టుకు ప్రత్యేక క్రేజీ ఉంటుంది. ఆ టెస్టుకు చెందిన డే వన్ టికెట్లు అన్నీ అమ్ముడుపోయినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది. నాన్ మెంబర్స్ కోసం డిసెంబర్ 24వ తేదీన కొన్నిటికెట్లను అమ్మకానికి రిలీజ్ చేయనున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది.



## టీ20 ప్రపంచకప్ గెలిచి 'గురు దక్షిణ'గా ఇస్తానని రోహిత్ చెప్పాడు

- రోహిత్ కోచ్ కోచ్ దినేశ్ లడ్

బలగం టీవీ, ముంబై

టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ చిన్ననాటి కోచ్ దినేశ్ లడ్ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. దినేశ్‌కు రోహిత్ ఒక ప్రమాణం చేసి అది నిలబెట్టుకున్నాడట కోచ్ దినేశ్ లడ్ మాట్లాడుతూ '2023 వన్డే వరల్డ్ కప్ ఓటమి తర్వాత రోహిత్‌ను కలిశా. ఫైనల్‌లో మనం బాగా ఆడలేదు. ముఖ్యంగా నువ్వు ఔటైన తీరు, మ్యాచ్‌పై ప్రభావం చూపింది. ఆ టైమ్‌లో నీ వికెట్ పడకుండా ఉండుంటే పరిస్థితి ఇంకోలా ఉండేదేమో! కానీ, మొత్తం సిరీస్‌లో నువ్వు చాలా పాజిటివ్‌గా, జట్టు కోసం అద్భుతంగా ఆడావు' అని రోహిత్‌తో చెప్పాను. అప్పుడు రోహత్ ప్రామిస్ చేశాడు. టీ20 ప్రపంచకప్ నెగ్గి, ఆ విజయాన్ని తనకు 'గురు దక్షిణ'గా ఇస్తానని అన్నాడు. ఫైనల్ మ్యాచ్ గెలిచిన తర్వాత నాకు ఫోన్ చేసి 'మీ ఫీజు (ట్రోఫీ) తీసుకొస్తున్నాను' అన్నాడు' అని వాళ్లిద్దరి మధ్య జరిగిన సంభాషణ గురించి చెప్పాడు.




## ఒకే ఇంట్లో నలుగురు అంతర్జాతీయ క్రికెటర్లు..

బలగం టీవీ, ముంబై

తన కుటుంబం నుంచి అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న నాలుగో వ్యక్తిగా బెన్ కరన్ నిలవనున్నాడు. ఇంగ్లండ్ జట్టులో స్టార్ ప్లేయర్లు అయిన సామ్ కరన్–టామ్ కరన్ సోదరుడే బెన్ కరన్. అయితే తన బ్రదర్స్‌లా ఇంగ్లండ్‌కు కాకుండా జింబాబ్వే తరఫున ఇంటర్నేషనల్ క్రికెట్ ఆడనున్నాడు. అఫ్గానిస్థాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు జింబాబ్వే జట్టుకు ఎంపికయ్యాడు.

బెన్ కరన్ తండ్రి కెవిన్ కరన్ జింబాబ్వే తరఫున ప్రాతినిథ్యం వహించిన సంగతి తెలిసిందే. 11 వన్డేలు ఆడిన కెవిన్ 287 పరుగులు, 9 వికెట్లు ఆడాడు. కాగా, తండ్రి కెవిన్ కరన్ అడుగుజాడల్లో నడిచి ముగ్గురు కుమారులు ప్రొఫెషనల్ క్రికెటర్లుగా ఎదిగారు. 28 ఏళ్ల బెన్ కరన్ ఎడమచేతి వాటం టాప్ ఆర్డర్ బ్యాటర్. కుడిచేతితో ఆఫ్ స్పిన్ కూడా వేయగలడు. 45 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 34.70 సగటుతో 2429 పరుగులు చేశాడు. 36 లిస్ట్–ఏ మ్యాచ్‌ల్లో 999 పరుగులు చేశాడు. కాగా, జింబాబ్వే పర్యటనలో అఫ్గానిస్థాన్ మూడు టీ20లు, మూడు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. అయితే అఫ్గాన్ టీ20 సిరీస్‌కు ప్రకటించిన జింబాబ్వే జట్టులో బెన్ కరన్‌కు ఎంపిక కాలేదు. వన్డే సిరీస్‌కు మాత్రమే సెలక్ట్ అయ్యాడు. దేశవాళీలో రాణిస్తున్న బెన్ కరన్ 50 ఓవర్ల ఫార్మాట్‌లో అవకాశం దక్కించుకున్నాడు.